# దుబ్బాక.. దూకుడు

## స్వరాష్ట్రంలో ప్రగతి పథంలో దుబ్బాక నియోజకవర్గం

- ఇంద్రభవనంలో సీఎం 'కేసీఆర్ బడి' నిర్మాణం
- రూ. 3.50 కోట్లతో మోడల్ బస్టాండ్ నిర్మాణం
- కిడ్నీ బాధితులకు డయాలసిస్ కేంద్రం ఏర్పాటు
- హబ్షీపూర్‌లో వ్యవసాయ గిడ్డంగుల నిర్మాణం
- కల్యాణలక్ష్మితో పేదింట పెండ్లిబాజాలు
- రైతు కుటుంబానికి భరోసానిచ్చిన రైతుబంధు, రైతుబీమా, నిరంతర విద్యుత్, విత్తనాల పంపిణీ
- ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు
- పేదలకు ప్రభుత్వం చేయూత
- లబ్ధిదారుల మోముల్లో చిరునవ్వులు



నూతనంగా ఏర్పడిన అక్బర్‌పేట-భూంపల్లి మండలం వ్యూ

దుబ్బాక, నవంబర్ 25: తెలంగాణ ఏర్పాటు తర్వాత దుబ్బాక నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయి.అభివృద్ధి జోరందుకుంది. దుబ్బాకలో విద్యనభ్యసించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఈ ప్రాంతమంటే ఎనలేని మమకారం. దీంతో నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సహకారంతో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవ, దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి ప్రత్యేక కృషి వల్ల దుబ్బాక నియోజకవర్గానికి రాష్టంలోనే అధికంగా 3,439 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరయ్యాయి. ఇండ్ల నిర్మాణ పనులు పూర్తయి పేదలకు పంచారు. గృహలక్ష్మి కింద పేదలకు ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం అందించడానికి దరఖాస్తులు తీసుకున్నారు. సంక్షేమ పథకాలు ఇంటింటికీ ందుతున్నాయి.

## 60 వేలకు పైగా ఆసరా పింఛన్లు



మొదటిసారి ఆసరా పింఛన్ అందుకున్న వృద్ధురాలు

దుబ్బాక నియోజకవర్గంలో 60 వేలకు పైగా ఆసరా పింఛన్లు వస్తున్నాయి. రాష్ట్రంలోనే అధికంగా దుబ్బాక నియోజకవర్గంలో ఆసరా పింఛన్లు ఉండటం విశేషం. గతంలో రూ. 200 ఉన్న పింఛన్‌ను కేసీఆర్ సర్కారు రూ.2 వేలకు పెంచింది. 57 ఏండ్లు నిండిన వారికి వృద్ధాప్య పింఛన్‌తో పాటు అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, పైలేరియా, హెచ్ఐవీ రోగులు, బీడీ కార్మికులు, నేత, గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్లు అందజేస్తున్నది. పేదింటి ఆడబిడ్డ పెండ్లికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా లక్ష రూపాయలు అందించి కొండంత అండగా కేసీఆర్ సర్కారు నిలిచింది.

## మెరుగైన వైద్య సేవలు..

దుబ్బాక పట్టణంలో రూ.20 కోట్లతో '100 పడకల దవాఖాన' భవనాన్ని అధునాతన వసతులతో నిర్మించారు. దీనిని కొన్ని నెలల క్రితం ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు ప్రారంభోత్సవం చేశారు.దుబ్బాకలో నిర్మించిన వంద పడకల దవాఖాన కేవలం దుబ్బాక నియోజకవర్గ ప్రజలకే కాకుండా (మెదక్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల) సరిహద్దు గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయి. సామాజిక ఆరోగ్య కేంద్రం(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో నిత్యం వందలాది మంది వైద్య సేవలు పొందుతున్నారు.ప్రధానంగా 'దుబ్బాక దవాఖాన' ప్రసూతి వైద్య సేవలకు ప్రత్యేక గుర్తింపు లభించింది.

## కిడ్నీ బాధితుల కోసం.. రూ.50 లక్షలతో డయాలసిస్ కేంద్రం

గత ఏడాది కిందట దుబ్బాకలో వంద పడకల దవాఖానను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. డయాలసిస్ రోగులను దృష్టిలో పెట్టుకుని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాక దవాఖానకు డయాలసిస్ కేంద్రం మంజూరు చేయాలని మంత్రి హరీశ్‌రావుకు విన్నవించగా వెంటనే మంజూరు చేశారు. గతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ కోసం హైదరాబాద్, సిద్దిపేట, కరీంనగర్ వెళ్లాల్సి ఉండేది. దుబ్బాకలో డయాలిసిస్ కేంద్రం ఏర్పాటుతో కిడ్నీ బాధితులకు వరంగా మారింది.




## ఇంద్రభవనం ..సీఎం 'కేసీఆర్ బడి'

విద్యాబుద్ధులు నేర్చుకున్న దుబ్బాక పాఠశాలపై మమకారంతో సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులు మంజూరు చేశారు. నాటి పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ పాత భవనాన్ని కూల్చివేయించి అదే చోట రూ.11 కోట్లతో కార్పొరేట్ స్థాయిలో సకల సౌకర్యాలతో కొత్త భవనాన్ని కట్టించారు. దుబ్బాకలో ఇంద్రభవనం తలపించేలా సర్కారు బడి నిర్మించడం పట్టణానికి వన్నె తెచ్చింది. సీఎం కేసీఆర్‌కు దుబ్బాకపై ఉన్న అభిమానం, చదువుకున్న పాఠశాలపై ఉన్న మమకారానికి నిదర్శనంగా కేసీఆర్‌బడిని అభివృద్ధి చేశారు.



దుబ్బాకలోని కేసీఆర్ బడి

## నియోజకవర్గానికో.. మైనార్టీ గురుకుల పాఠశాల

తెలంగాణ మైనార్టీ గురుకులాలు దేశానికే ఆదర్శంగా మారాయి. 2016లో రాష్ట్రంలో సీఎం కేసీఆర్ తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలకు శ్రీకారం చుట్టారు. ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రవేశ పెట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో 204 (మైనార్టీ పాఠశాలలు) బాలుర, బాలికల పాఠశాల, కళాశాలలు కొనసాగుతున్నాయి. గురుకుల (రెసిడెన్షియల్) పాఠశాలలో 75 శాతం మైనార్టీలకు, 25 శాతం అన్ని వర్గాల పేదలకు కేటాయించారు. ఒక్కో విద్యార్థికి ఏటా రూ.80 వేలు వెచ్చించి, గుణాత్మక విద్యనందిస్తున్నారు. ఇందులో దుబ్బాక మైనార్టీ గురుకుల పాఠశాల ప్రత్యేకంగా నిలిచింది. 2017లో ప్రారంభమైన గురుకుల పాఠశాల అప్‌గ్రేడ్ అవుతూ.. 2022-23 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ కళాశాలగా మారింది. దుబ్బాక మండలం హబ్షీపూర్, దౌల్తాబాద్, మిరుదొడ్డి మండలాల్లో జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల ఏర్పాటుతో గ్రామీణ పేద విద్యార్థులకు ఉన్నత విద్యావసతులు అందుబాటులోకి వచ్చాయి. దుబ్బాక నియోజకవర్గంలో 'మనఊరు-మనబడి' కింద 60 పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయి.



దుబ్బాక మైనార్టీ గురుకుల పాఠశాలలో పౌష్టికాహారం తింటున్న విద్యార్థులు (ఫైల్)

## రూ.8 కోట్లతో హబ్షీపూర్‌లో వ్యవసాయ గిడ్డంగులు

రైతులు పండించిన ప్రతి గింజనూ మద్దతు ధరతో కొనుగోలు చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సర్కారు దృష్టిసారించింది.మల్లన్నసాగర్‌తో ఏడాదికి రెండు పంటలు పండించడంతో ధాన్యం నిల్వలు భారీగా పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా గిడ్డంగుల నిర్మాణాలు చేపట్టింది. దుబ్బాక మండలంలోని హబ్షీపూర్ శివారులో రూ. 8 కోట్లతో అధునాతన వ్యవసాయ గిడ్డంగులు నిర్మించారు. 10 వేల మెట్రిక్ టన్నుల గిడ్డంగులతో పాటు కార్యాలయ భవనం, అంతర్గత సీసీ రోడ్డు, ప్రహరీ నిర్మించారు.




దుబ్బాకలో నిర్మించిన మోడల్ బస్టాండు



హబ్షీపూర్‌లో నూతనంగా నిర్మించిన ధాన్యం నిల్వల గిడ్డంగులు



దుబ్బాక టౌన్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయం



## వంద మందికి 'దళితబంధు'..

తొలి విడుతలో దుబ్బాక నియోజకవర్గం నుంచి వంద మంది దళితులకు దళితబంధు పథకం ద్వారా లబ్ధి చేకూరింది. దుబ్బాక మండలం ఆరెపల్లిలో 30 మందికి , దౌల్తాబాద్ మండలం మహ్మద్‌షాపూర్‌లో 70 మందికి దళితబంధు వర్తించింది. ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షల ఆర్థిక సహాయం ప్రభుత్వం అందించింది.



## మల్లన్న సాగర్‌తో దుబ్బాక సస్యశ్యామలం

తొగుట మండలంలో నిర్మించిన మల్లన్నసాగర్ దుబ్బాక నియోజకవర్గానికి ఓ వరంగా మారింది. భావితరాలకు నీటి సమస్య తలెత్తకుండా సీఎం కేసీఆర్ ఎక్కడో ఉన్న గోదావరి జలాలను దుబ్బాక నియోజకవర్గానికి తీసుకొచ్చి అపర భగీరథుడిగా మారారు. తొగుటలో 50 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు మల్లన్నసాగర్ నిర్మించడం దుబ్బాక ప్రాంతానికి గర్వకారణం. దుబ్బాక నియోజకవర్గంలో ప్రధానమైన కూడవెల్లివాగు శాశ్వత జీవనదిగా మారింది. గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దుబ్బాక నియోజకవర్గంలో 21 చెరువులు నిండి మత్తళ్లు దుంకుతున్నాయి. దుబ్బాక నియోజకవర్గం పరిధిలో 24 చెక్‌డ్యామ్‌లకు ఇప్పటికే 22 చెక్‌డ్యామ్‌లు నిండి పొంగిపొర్లుతున్నాయి. నీటికి గోసతీరింది.

## మోడల్ బస్టాండ్ నిర్మాణం

దుబ్బాక నడిబోడ్డున నిర్మించిన మోడల్ బస్టాండ్‌తో పట్టణ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. దుబ్బాకపై మమకారంతో సీఎం కేసీఆర్ రూ. 3.50 కోట్లు కేటాయించారు. కేవలం ఏడాది కాలంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో దుబ్బాక బస్టాండ్ రాష్ట్రంలోనే మోడల్‌గా నిలిచింది. ఎకరాకు పైగా విస్తీర్ణంలో ఉన్న బస్టాండ్ స్థలంలో.. ఒకవైపు నుంచి బస్సులు వచ్చేందుకు (ఇన్), మరో వైపు నుంచి బస్సులు బయటకు (ఔట్)వెళ్లేందుకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశారు.

## కూడవెల్లి వాగులో గోదావరి జల సవ్వడులు

దుబ్బాక నేల తల్లిని ముద్దాడేందుకు ..గోదావరి జలాలు తరలిరావటంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ 12వ ప్యాకేజీ ప్రధాన కాల్వ నుంచి ప్యాకేజీ (దుబ్బాక కెనాల్) ద్వారా దుబ్బాక, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల (ముస్తాబాద్) నియోజకవర్గాల్లో చెరువులు, కుంటలు జలకళ సంతరించనున్నాయి. జిల్లాతో పాటు పక్కనే ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు గ్రామాలకు సైతం సాగునీరు అందుతుంది. దుబ్బాక నియోజకవర్గంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల ద్వారా మొత్తం 1.27 లక్షల ఎకరాలకు సాగు నీరు అందనుంది. దీంతో పాటు నియోజకవర్గంలో ప్రధానవాగు కూడవెల్లి జీవనదిగా మారింది.



మల్లన్నసాగర్‌తో జీవనదిగా మారిన కూడవెల్లివాగు (ఫైల్)



దుబ్బాకలో నిర్మించిన బాలాజీ దేవాలయం

## ఉద్యమ గడ్డపై ..ఆధ్యాత్మికత..

సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో దుబ్బాక ఆధ్యాత్మిక క్షేత్రంగా మారింది. దుబ్బాకలో నిర్మించిన బాలాజీ దేవాలయానికి సీఎం కేసీఆర్ రూ. 6 కోట్లు మంజూరు చేశారు. ఆలయ నిర్మాణ పనులు సీఎం కేసీఆర్ పర్యవేక్షణలో జరిగాయి. ఆలయ అర్చకులకు వేతనాలు, గ్రామాల్లో దేవాలయాలకు నిధులు కేటాయించి ఆధ్యాత్మికతను పెంపొందించారు. భక్తుల కోసం దుబ్బాక నుంచి తిరుపతికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించారు.



దుబ్బాక-భూంపల్లి రోడ్డు



దుబ్బాక మున్సిపల్ కార్యాలయం

## బీటీ రోడ్ల నిర్మాణంతో సాఫీగా ప్రయాణం

దుబ్బాక నియోజకవర్గంలో అద్దంలా మెరిసే రహదారుల నిర్మాణం జరిగింది. దుబ్బాక మండలంలో చీకోడు-కొత్తపల్లి వరకు రూ. 7 కోట్లతో రహదారి విస్తరణ పనులు చేపట్టారు. దుబ్బాక-ముస్తాబాద్ రోడ్డు, దౌల్తాబాద్-కర్ణాలపల్లి రోడ్లకు మహర్దశ పట్టింది. రూ.34 కోట్లతో రహదారుల విస్తరణ పనులు చేపట్టారు. దుబ్బాక-భూంపల్లి రహదారి రోడ్డుతో దుబ్బా క, మిరుదొడ్డి మండలాల ప్రజలకు ప్రయాణం మెరుగుపడింది. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు, మండల కేంద్రాల నుంచి నియోజకవర్గ కేంద్రానికి వెళ్లేందుకు రహదానులను కోట్లాది రూపాయలతో నిర్మించారు.